క్లుప్తంగా

జీర్ణోద్ధరణ మహాసంప్రోక్షణ ఉత్సవాలు ప్రారంభం



దుత్తలూరు: నర్రవాడలోని శ్రీదేవి, భూదేవి సమేత జనార్దనస్వామి ఆలయంలో జీర్ణోద్ధరణ మహాసంప్రోక్షణ ఉత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ గోపూజ, విశ్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాహవచనం, ఆచార్య రుత్విగరణం, వాస్తుపూజ, వాస్తుహోమం, విష్ణు సహస్రనామ పారాయణం, మృత్సంగ్రహణం, అంకురార్పణ, తదితర పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ చైర్మన్ మాదాల బాబూరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నిత్యావసర వస్తువుల ధరల పరిశీలన

ఆత్మకూరు: పట్టణంలోని వివిధ దుకాణాల్లో 18 రకాల నిత్యావసర వస్తువుల ధరలను జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి టీ లక్ష్మీ నరసింహులు గురువారం పరిశీలించారు. జీఆర్‌పేట, బస్టాండ్ సెంటర్, మెయిన్ బజార్‌లలోని దుకాణాలను ఏఎస్‌ఓ లలితతో కలిసి సందర్శించి నిత్యావసర వస్తువుల ధరల్లోని తేడాలను నమోదు చేసుకున్నారు. ధరల్లో తేడాలు ఉండడంపై దుకాణదారులను ప్రశ్నించారు. నివేదికలను అర్థ గణాంక శాఖకు పంపనున్నట్లు ఆయన తెలిపారు.

కళాశాల వార్షికోత్సవం



కావలి: పట్టణంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో 23వ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ వెంకయ్య, ప్రిన్సిపల్ టీవీ లుకోధర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి విశిష్ట అతిథి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, కళాశాల డైరెక్టర్ పీవీఎస్ ప్రసాద్, తదితరులు హాజరయ్యారు. ఉత్తమ మార్కులు సాధించిన, క్రీడల్లో ప్రతిభకనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. హాజరయ్యారు. జబర్దస్త్ నటులు అప్పారావు, వినోదిని, నవీన్, స్థానిక వైద్యుడు డాక్టర్ బెజవాడ రవికుమార్ పాల్గొన్నారు.

మంత్రి ఆనం పరామర్శ

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం గుండెమడకలలో గురువారం జరిగిన ఎఫ్‌సీఐ మాజీ డైరెక్టర్ అంకినపల్లి ఓబుల్‌రెడ్డి సతీమణి ఉత్తరక్రియల్లో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పాల్గొన్నారు. ఓబుల్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయకులు మెట్టుకూరు ధనుంజయరెడ్డి, పుట్టం బ్రహ్మారెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, విశ్రాంత డీఎంహెచ్‌ఓ మాశిలామణి, స్థానిక నేతలు వనిపెంట సుబ్బారెడ్డి, చంద్రా ఉమ, పులిచర్ల నారాయణరెడ్డి, జూపల్లి రాజారావు, ఆంద్రా నాగిరెడ్డి, ఆంద్రా బాలగురవారెడ్డి, ఉండేల గురవారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై డ్రిప్ పరికరాలు

ఉదయగిరి: రైతులకు సబ్సిడీపై డ్రిప్ పరికరాలను మంజూరు చేస్తున్నట్లు ఉద్యాన శాఖ అధికారిణి జయశ్రీ తెలిపారు. మండలంలోని అప్పసముద్రంలో గురువారం ఆమె పర్యటించారు. రైతులకు డ్రిప్ పరికరాలపై అవగాహన కల్పించారు. డ్రిప్ పరికరాలు కావాల్సిన రైతులు సమీపంలోని రైతుసేవా కేంద్రాల్లోని వ్యవసాయ సిబ్బందిని కలిసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గతంలో దరఖాస్తు చేసుకున్న రైతులకు డ్రిప్ పరికరాలు మంజూరయ్యాయని, సబ్సిడీపోగా మిగిలిన నగదును చెల్లిస్తే వెంటనే ఏర్పాటు చేస్తామని తెలిపారు.

గేదెను ఢీకొని కారు బోల్తా

సోమశిల: గేదెను ఢీకొని కారు బోల్తా పడిన ఘటన అనంతసాగరం మండలం పాతాళపల్లి వద్ద గురువారం వేకువన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు .. ప్రొద్దుటూరుకు చెందిన ముగ్గురు యువకులు కారులో బుధవారం రాత్రి చెన్నైకు వెళ్తున్నారు. వేకువజామున పాతళపల్లి వద్దకు రాగానే జాతీయ రహదారిపై ఉన్న గేదెను పొగమంచులో గుర్తించక ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో గేదె మృతి చెందగా కారు బోల్తా పడింది. కారులోని ముగ్గురు యువకులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అనంతరం వారు వేరే వాహనంలో వెళ్లిపోయారు. సోమశిల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రోడ్డుపై మృతి చెందిన గేదెను పక్కకు తొలగించారు.

చేతి పంపుల ఏర్పాటు

కలిగిరి: కలిగిరి పంచాయతీ పరిధిలోని ఐదు బోర్లకు పంచాయతీ ఆధ్వర్యంలో గురువారం చేతిపంపులను ఏర్పాటు చేశారు. వార్డు సభ్యుల కోరిక మేరకు సర్పంచ్ రాగి దివ్య, ఉపసర్పంచ్ పాలూరు కొండారెడ్డి సూచనలతో పంచాయతీ కార్యదర్శి రవిచంద్ర బోర్లకు చేతి పంపులను అమర్చారు. పాపనముసిలిపాళెం, ఎస్సీకాలనీ, వెంకన్నపాళెం బీసీ, ఎస్సీ కాలనీలు, జిర్రావారిపాళెం ఎస్సీ కాలనీకి సంబంధిన శ్మశానంలో చేతిపంపులను అమర్చడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నత విద్యకు అడుగులు పడేనా?

- కావలిలో ప్రభుత్వ రంగంలో ఏర్పాటు కాని ఉన్నత విద్యా సంస్థలు
- ఉన్నత విద్యకు పేద విద్యార్థులు దూరం



తాత్కాలికంగా కేంద్రీయ విద్యాలయ ప్రారంభానికి గుర్తించిన కావలి జెడ్పీ ఉన్నత పాఠశాలలోని భవనం

కావలి: కావలి మున్సిపాలిటీగా రూపాంతరం చెంది ఏళ్లు గడుస్తోంది. పట్టణ జనాభా సైతం శరవేగంగా వృద్ధి చెందుతోంది. అయినా ఇప్పటి వరకు పట్టణంలో ప్రభుత్వ ఉన్నత విద్యా సంస్థలు లేవు. ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్, ఐటీఐ కళాశాలలు లేకపోవడంతో పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు.

సాంకేతిక విద్యతో ప్రయోజనం

గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో కావలి వద్ద నిర్మాణం మొదలు పెట్టిన రామాయపట్నం పోర్టుకు అనుబంధంగా పారిశ్రామికవాడను ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (ఏపీఐఐసీ) ద్వారా నివేదికలు సిద్ధం చేశారు. చెన్నాయపాళెం, పెద్దపట్టపుపాళెం, ఆనెమడుగు, సర్వాయపాళెం పంచాయతీల పరిధిలో సుమారు 5వేల ఎకరాలను సేకరించేందుకు నివేదికలు సైతం సిద్ధం చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం సైతం ఈ ప్రక్రియను రాష్ట్ర మారిటైం బోర్డుకు అప్పగించింది. రామాయపట్నంపోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లకు అనుబంధంగా భవిష్యత్తులో పెద్దఎత్తున పరిశ్రమలు ఏర్పాటు అయ్యే అవకాశం ఉంది. అందులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభించే అవకాశం ఉంది. ఈ మేరకు నైపుణ్యం కలిగిన యువతను సిద్ధం చేయాల్సి ఉంటుంది. అయితే కావలి పట్టణంలో ప్రభుత్వ రంగంలో జూనియర్, డిగ్రీ, ఐటీఐ, ఇంజనీరింగ్ కళాశాలలు లేవు. దీంతో పేద విద్యార్థులకు సాంకేతిక విద్యకు దూరమవుతున్నారు.

మత్స్యకార గురుకుల హామీ నెరవేరేనా?

కావలి నియోజకవర్గంలోని కావలి, బోగోలు, అల్లూరు మండలాల్లోని తీరప్రాంతంలో మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. మత్స్యకారుల పిల్లలు చదువుకు దూరం కాకుండా ప్రత్యేకంగా గురుకుల విద్యాలయాన్ని మంజూరు చేయిస్తామని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి హామీ ఇచ్చారు. ఈ మేరకు మత్స్యకారులకు ప్రత్యేక గురుకులాన్ని ఏర్పాటు చేస్తే వారి భవిష్యత్తుకు బంగారు బాటలు పడుతాయి.

కేంద్రీయ విద్యాలయం మంజూరైనా..

కావలికి కేంద్రీయ విద్యాలయాన్ని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసినా ఇంత వరకు ప్రారంభానికి నోచుకోలేదు. ఇందుకోసం ఇప్పటికే కావలి మండలం రుద్రకోట వద్ద సర్వేనంబర్లు 596,597లో పదెకరాల భూమిని కేటాయించి ఉన్నారు. గతంలో కేంద్రీయ విద్యాలయాలకు సంబంధించిన అత్యున్నత స్థాయి అధికారి, కేంద్ర డిప్యూటీ కమిషనర్ మునివణ్ణన్ సైతం స్థలాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. స్థలాన్ని అప్పగిస్తే రెండేళ్లలో రూ.10.60కోట్లతో శాశ్వత భవనాలను నిర్మిస్తామని తెలిపారు. అప్పటి వరకు కావలిలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న భవనాన్ని అప్పగిస్తే తాత్కాలికంగా విద్యాలయాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. ఆ తరువాత జిల్లా అధికారులు తగిన చొరవ చూపకపోవడంతో విద్యాలయం ప్రారంభంలో జాప్యం చోటు చేసుకుంది. ప్రస్తుతం కేంద్రీయ విద్యాలయాన్ని బోగోలు మండలంలో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి చెబుతున్నారు. ఆ ఆలోచన ఆచరణకు నోచుకోవడం అంటే మళ్లీ వ్యవహారం మొదటి నుంచి ప్రారంభం కావాల్సి ఉంటుంది. దీని వల్ల కేంద్రీయ విద్యాలయం ప్రారంభంలో మరింత జాప్యం జరిగే అవకాశం ఉంది. అలాగే ప్రాథమిక విద్యలో నాణ్యతా ప్రమాణాలను పెంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది కొత్తగా సైనిక్ స్కూళ్లను మంజూరు చేస్తోంది. చిన్నారుల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా విద్యారంగంలో క్రమశిక్షణ, సమయపాలన, అంకితభావం, దేశభక్తి, నిస్వార్థ సేవ, స్వీయనియంత్రణ వంటి అంశాలలో పాఠశాల విద్య నుంచి బలమైన పునాదులు వేయడానికి వాటిని నెలకొల్పుతోంది. దీనిపై ప్రజాప్రతినిధులు దృష్టి సారించి ప్రయత్నాలు చేస్తే సానుకూల ఫలితాలు వచ్చే అవకాశం ఉంది. ఈ విద్యా సంస్థలన్నీ కావలిలో ఏర్పాటైతే నైపుణ్యం కలిగిన యువత తయారవుతారు. తద్వారా భవిష్యత్తులో పరిశ్రమల నిర్మాణం జరిగితే అందులో ఉద్యోగావకాశాలు అందిపుచ్చుకునేందుకు అవకాశం కలుగుతుంది.

స్పోర్ట్స్ స్కూల్‌తో క్రీడాకారులకు భవిష్యత్తు

కావలి పట్టణంతో పాటు చుట్టపక్కల గ్రామాలకు చెందిన వందలాది మంది విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా రాణిస్తున్నారు. కావలిలో స్టేడియం నిర్మాణం చేపట్టనున్న నేపథ్యంలో దానికి అనుబంధంగా స్పోర్ట్స్ స్కూల్‌ను ఏర్పాటు చేయాల్సిన అవశ్యకత ఎంతో ఉంది. స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటైతే క్రీడాకారులు మరింతగా రాణించే అవకాశం ఉంది. ఆ దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవచూపాల్సిన అవసరం ఎంతో ఉంది.

స్పోర్ట్స్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలి



కావలితో పాటు చుట్టపక్కల గ్రామాలకు చెందిన విద్యార్థులు, యువత రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రీడల్లో రాణించారు. అయితే క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి కావలిలో సరైన వేదిక లేదు. గత 40 ఏళ్ల నుంచి కావలిలో స్టేడియాన్ని నిర్మించాలని కోరుతున్నాం. ప్రస్తుతం స్టేడియం నిర్మాణానికి రూ.2.60 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ప్రకటించారు. దానికి అనుబంధంగా క్రీడాకారులకు మాత్రమే ప్రవేశం ఉండే స్పోర్ట్స్ స్కూల్‌ను ప్రారంభిస్తే స్టేడియం నిర్మాణానికి సార్థకత చేకూరుతుంది.
– సమాధి గిరిబాబు, అధ్యక్షుడు, అమెచ్యూర్ అథ్లెటిక్ అసోసియేషన్, కావలి

ప్రత్యేక గురుకులంతో ఉజ్వల భవిత



ఎన్నికలు ఎప్పుడు వచ్చినా మత్స్యకార గ్రామాలకు ఓట్ల కోసం వచ్చే నాయకులు మత్స్యకార పిల్లల కోసం ప్రత్యేక గురుకులాన్ని ఏర్పాటు చేయిస్తామని హామీ ఇస్తుంటారు. అలాంటి మాటలు వింటూనే నేను డిగ్రీ చదివాను. కానీ ఇప్పటి వరకు ఆ దిశగా ఎవరూ చర్యలు చేపట్టలేదు. ఇప్పటికైనా మత్స్యకార పిల్లల కోసం ప్రత్యేకంగా గురుకులాన్ని ఏర్పాటు చేసి భవిష్యత్తుకు బాటలు వేయాలి.
–కాటంగారి సురేష్, డిగ్రీ విద్యార్థి, కొత్తసత్రం, కావలిరూరల్

దురదృష్టకరం

జిల్లాలో నెల్లూరు తరువాత పెద్ద పట్టణమైన కావలిలో ప్రభుత్వ రంగంలో పాలిటెక్నిక్, ఐటీఐ, జూనియర్, డిగ్రీ, ఇంజనీరింగ్ వంటి ఉన్నత విద్యాసంస్థలు లేకపోవడం దురదృష్టకరం. ఆ దిశగా పాలకులు, అధికారులు చర్యలు చేపట్టకపోవడం విచారకరం. గతంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన కార్యరూపం దాల్చలేదు. రామాయపట్నం, ఫిషింగ్ హార్బర్‌లకు అనుబంధంగా భవిష్యత్తులో పరిశ్రమలు ఏర్పాటు అయ్యే అవకాశం ఉంది.అందకనుగుణంగా యువతలో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రభుత్వ రంగంలో ఉన్నత విద్యా సంస్థల ఏర్పాటుకు ప్రతిపాదనలు చేయక యువశక్తిని నిర్వీర్యం చేయడం గర్హనీయం.
–చాకలకొండ శారద, విశ్రాంత హెచ్‌ఎం, కావలి

మహాత్ముని ఆశయాలు అనుసరణీయం



కావలి: గాంధీకి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఉదయగిరి మండల పరిషత్ కార్యాలయంలో..



వరికుంటపాడు మండల పరిషత్ కార్యాలయంలో..



సంగంలో నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య నాయకులు



కలిగిరి: నాగసముద్రం బీసీకాలనీ పాఠశాలలో..

కావలి: పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసంలో గాంధీ వర్ధంతిని గురువారం నిర్వహించారు. జాతిపిత చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహాత్ముని ఆశయాలు అనుసరణీయమని పేర్కొన్నారు.

ఉదయగిరి: మండల పరిషత్ కార్యాలయంలో ఏఓ సీహెచ్ పద్మజ ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మహాత్ముని సేవలను స్మరించుకున్నారు. జూనియర్ సహాయకులు అబ్దుల్ సమద్, ఆపరేటర్ ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.

కలిగిరి: నాగసముద్రం పంచాయతీ పరిధిలోని బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో లోక్ అదాలత్ సభ్యులు ఎం మాలకొండారెడ్డి ఆధ్వర్యంలో జాతిపిత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గాంధీ జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంగం: మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్డీ వరప్రసాద్ ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న మహాత్ముని విగ్రహానికి ఆర్యవైశ్య సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘ నాయకులు గునుపూడి గిరిబాబు, గునుపూడి రాజా, ప్రభాకర్, శ్రీరాం, తదితరులు పాల్గొన్నారు.

వరికుంటపాడు: మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్డీ నాగూర్‌వలి ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీనియర్, జూనియర్ సహాయకులు కే వెంకటాద్రి, రామకృష్ణ, ఏపీఓ అజాం ఖాన్ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా
ముందస్తు చర్యలు



గాంధీకి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

దుత్తలూరు: రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీపీ చేజర్ల జయంత్‌రెడ్డి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలోఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహించారు. తొలుత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అధికారులు శాఖలవారీగా నివేదికలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో బోర్లు అవసరమైన వారు తెలియజేస్తే జెడ్పీ అధికారులతో మాట్లాడి మంజూరుకు కృషిచేస్తామన్నారు. మంచినీటి పథకాల పైపులైన్లను పరిశీలించి లీకేజీలు ఉంటే మరమ్మతులు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. బీసీ కార్పొరేషన్ ద్వారా మంజూరు చేస్తున్న సబ్సిడీ రుణాలపై ప్రజాప్రతినిధులు గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. జెడ్పీటీసీ లెక్కల లక్ష్మీకాంతమ్మ మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశానికి పూర్తిస్థాయిలో అధికారులు హాజరుకాకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు గ్రామాల్లోని సమస్యలను సభ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందన్నారు. పలువురు సర్పంచ్‌లు మాట్లాడుతూ విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యంపై మండిపడ్డారు. గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలని ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఎంపీడీఓ మీసాల వెంకటేశ్వర్లు, సర్పంచ్‌ల సంఘ మండలాధ్యక్షుడు మీసాల సుబ్బరాయుడు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కుష్టు రహిత సమాజానికి కృషి చేయాలి



ఏఎస్‌పేటలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది



సీతారామపురం:విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యసిబ్బంది



ఆత్మకూరులో కుష్టుపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ హుస్సేనమ్మ

ఆత్మకూరు: జిల్లాలో కుష్టు నివారణకు వైద్యారోగ్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా మలేరియా నివారణాధికారిణి హుస్సేనమ్మ అన్నారు. గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో కుష్టు వ్యాధిపై వైద్యారోగ్య సిబ్బందికి గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చర్మంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు, కాళ్లు, చేతులపై స్పర్శ తగ్గడం, తదితరాలు కుష్టు లక్షణాలని తెలిపారు. కుష్టును ప్రాథమిక దశలో మందులతో నయం చేయవచ్చని తెలిపారు. కుష్టుపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం డెంగీ, మలేరియా, తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు. తొలుత మహాత్మ గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం వైద్యారోగ్య సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ అస్మా, ఎంపీహెచ్‌ఈఓ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

చేజర్ల: మండలంలోని చిత్తలూరులో ఏఎన్‌ఎం అరుణ ఆధ్వర్యంలో కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు. అనంతరం కుష్టు రహిత సమాజానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. సర్పంచ్ బీ విజయమ్మ, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, ఆశాకార్యకర్త వసంత తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం: మండలంలోని బసినేనిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు కుష్టు వ్యాధి పై సీతారామపురం పీహెచ్‌సీ వైద్యాధికారిణి స్వప్నారెడ్డి అవగాహన కల్పించారు. అనంతరం కుష్టు రహిత సమాజానికి కృషి చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం ఉదయకుమారి, ఎంపీహెచ్‌ఈఓ మజీద్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వరికుంటపాడు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యారోగ్య సిబ్బందికి కుష్టువ్యాధిపై అవగాహన కల్పించారు. సీహెచ్‌ఓ రాజశేఖరరాజు మాట్లాడుతూ కుష్టు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాల్లో భాగంగా వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టి లక్షణాలు ఉన్న వారిని గుర్తించాలని సూచించారు. పీహెచ్‌సీలకు తీసుకొచ్చి వైద్యుల వద్ద పరీక్షలు చేయించి మందులు అందజేయాలని సూచించారు.

అనుమసముద్రంపేట: స్థానిక పీహెచ్‌సీలో వైద్యారోగ్య సిబ్బదికి డాక్టర్ సురేష్‌బాబు కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. వచ్చే నెల 13వ తేదీ వరకు ఇంటింటి సర్వే చేపట్టి కుష్టు లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వైద్యచికిత్స అందించాలని సూచించారు.

వాసవీమాత ఆత్మత్యాగం నూతన శకానికి నాంది



కావలి: ధర్మాన్ని నిలిపేందుకు, స్త్రీ గౌరవాన్ని కాపాడేందుకు, వైశ్యుల ఔదార్యాన్ని ప్రపంచానికి చాటేందుకు కలియుగంలో వాసవీ మాత జన్మించింది. ఆమె దేశభక్తి, నిజాయితీ, సమాజ సేవ, సహనం మొదలగు వాటిని సమాజానికి ఉపదేశించింది. వాసవి ఆత్మత్యాగం ఒక నూతన శకానికి నాందిగా నిలిచింది. అప్పటి నుంచి వైశ్యులందరూ వాసవీ కన్యకా పరమేశ్వరిని కుల దేవతగా తలచి పూజిస్తున్నారు.

దివ్యాంగ పింఛన్ల పరిశీలన పూర్తి

మర్రిపాడు: మండలంలో దివ్యాంగ పింఛన్ల పరిశీలన పూర్తయినట్లు మర్రిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి గోపినాథ్ గురువారం తెలిపారు. 17 గ్రామ సచివాలయాల పరిధిలోని 24 పంచాయతీల్లో ఇద్దరు మెడికల్ ప్రొఫెసర్లు, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎం, హెల్త్ అసిస్టెంట్లతో కలిసి శారీరక వైకల్యంతో మంచానికే పరిమితమై రూ.15వేలు పింఛన్ తీసుకుంటున్న 51 మంది సదరం సర్టిఫికెట్లను పరిశీలించినట్లు చెప్పారు.

పశుఆరోగ్య శిబిరం

ఆత్మకూరురూరల్: మండలంలోని నారంపేటలో పశుఆరోగ్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. పశువైద్య సిబ్బంది పశువులు, జీవాలకు వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. ఆత్మకూరు ఏడీఏ జయచంద్ర పాడి రైతులకు పశుపోషణ, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. మాజీ ఎమ్మెల్యే కంచర్ల శ్రీహరి నాయుడు, సర్పంచ్ కంచర్ల మాధవి పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

ఆత్మకూరు: పట్టణంలోని ప్రగతి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ప్రతిభా పరీక్షల్లో ప్రతిభకనబర్చిన విద్యార్థులకు గురువారం బహుమతులను ప్రదానం చేశారు. ఎంఎంటీఎస్‌ఈ పరీక్షల్లో ఆత్మకూరు నియోజకవర్గ స్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థి కే ప్రవీణ్‌తో పాటు రెండ్రోజుల క్రితం గుంటూరులో జరిగిన జిల్లా స్థాయి స్పెల్‌బి పోటీల్లో తృతీయ స్థానం సాధించిన ఎస్‌కే జువేరియాకు సీఐ జీ గంగాధర్ చేతుల మీదుగా బహుమతులను అందజేసి అభినందించారు. పాఠశాల నిర్వాహకులు రామ్మోహన్‌రెడ్డి, డైరెక్టర్ అమరావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనుమసముద్రంపేట/ఆత్మకూరు: బీసీ సంక్షేమ శాఖ, ఎస్సీ, ఇతర కార్పొరేషన్ల ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వారి జీవనోపాధులను మెరుగుపరిచేందుకు సబ్సిడీపై రుణాలను మంజూరు చేస్తున్నట్లు ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ సీ గంగా ప్రసాద్, ఎంపీడీఓ ప్రసన్నకుమారి గురువారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఏఎస్‌పేట మండలానికి బీసీ కార్పొరేషన్ 30, కాపు కార్పొరేషన్ 4, రెడ్డి కార్పొరేషన్ 4, ఈబీసీ కార్పొరేషన్ 2, కమ్మ కార్పొరేషన్ 2, ఆర్యవైశ్య కార్పొరేషన్ 1, ఎస్సీ కార్పొరేషన్ 10 చొప్పున మొత్తం 53 యూనిట్లు మంజూరయ్యాయి. అర్హులైన వారు ఫిబ్రవరి 7వ తేదీలోగా ఏపీఓబీఎంఎంఎస్ సైట్ లేదా సమీపంలోని సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

డ్రైనేజీ నిర్మాణ పనుల ప్రారంభం

ఉదయగిరి: పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం భవనం వెనుకవైపు వీధిలో డ్రైనేజీ నిర్మాణ పనులను ఎంపీటీసీ సభ్యుడు గొల్లపల్లి తిరుపతి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీ లేక ప్రజలు ఇబ్బందులు పడుతుండగా సమస్యను సర్పంచ్ పామూలూరి సామ్రాజ్యం, ఉపసర్పంచ్ ముర్తుజాహుస్సేన్, ఎంపీపీ మూలే పద్మజ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. స్పందించిన ఎంపీపీ తన నిధుల నుంచి రూ.3 లక్షలు కేటాయించడంతో పనులు ప్రారంభించామని తెలిపారు. వార్డు సభ్యులు, నాయకులు రియాజ్, శ్రీనివాసులు, హరి, యస్దానీ, జబీవుల్లా, ఖాదర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.